సాక్షి
ప్రకాశం

గురువారం । 11 । జనవరి । 2024



స్మృతివనం.. చారిత్రక ఘట్టం

125 అడుగుల అంబేడ్కర్ విగ్రహాన్ని సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ఆవిష్కరించడం చారిత్రాత్మక ఘట్టమని రాష్ట్ర ఎస్సీ కమిషన్ చైర్మన్ ఎం.విక్టర్ ప్రసాద్ పేర్కొన్నారు.

- 8లో..



గిరిజనులకు పూర్తి స్థాయిలో రక్త పరీక్షలు

గిరిజన ప్రాంతాల్లో పూర్తి స్థాయిలో వైద్య పరీక్షలు నిర్వహించాలని కలెక్టర్ ఏఎస్ దినేష్ కుమార్ అధికారులను ఆదేశించారు.

- 8లో..

గరిష్టం/కనిష్టం
30/22

వాతావరణం

ఉదయం పొగమంచు అధికంగా ఉంటుంది. ఆకాశం పాక్షికంగా మేఘావృతమై ఉంటుంది.

న్యూస్‌రీల్

ధాన్యం, కందుల కొనుగోలు ప్రక్రియపై శిక్షణ

ఒంగోలు అర్బన్: 2023–24 సీజన్‌కు సంబంధించి ధాన్యం, కందుల కొనుగోలు ప్రక్రియపై సివిల్ సప్లయిస్ డీఎం గ్లోరియా అధ్యక్షతన స్థానిక అంబేడ్కర్ భవనంలో సివిల్ సప్లయిస్ కార్పొరేషన్ ద్వారా కొత్తగా నియమించిన 75 మందికి శిక్షణ నిర్వహించారు. శిక్షణలో డీఎస్ఓ ఉదయభాస్కర్ పాల్గొని పలు సూచనలు చేశారు. దీనిలో ప్రొక్యూర్‌మెంట్‌కు సంబంధించి సాధారణ, సాంకేతిక అంశాలపై శిక్షణ ఇచ్చారు. ఈ ఏడాది మొదటిసారిగా కార్పొరేషన్ ద్వారా కందుల కొనుగోలు కూడా చేస్తున్నామని గ్లోరియా తెలిపారు. 10 వేల మెట్రిక్ టన్నుల ధాన్యం, 33 వేల మెట్రిక్ టన్నుల కందులు సేకరణ చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో డీసీఓ రాజశేఖర్, వ్యవసాయ శాఖ జేడీ శ్రీనివాసరావు, ఏఎం గంగాధర్ తదితరులు పాల్గొన్నారు.

సమర్థవంతంగా ఎన్నికల నిర్వహణ

● ఎస్పీ మలికా గర్గ్



ఎన్నికల నిర్వహణపై పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరిస్తున్న ఎస్పీ మలికాగర్గ్

ఒంగోలు సబర్బన్: సాధారణ ఎన్నికలను సమర్థవంతంగా నిర్వహించేందుకు ప్రణాళికాబద్ధమైన చర్యలు తీసుకోవాలని ఎస్పీ మలికాగర్గ్ ఆదేశించారు. జిల్లాలోని పోలీసు అధికారులు, సిబ్బందికి ఎన్నికల నిర్వహణ అంశాలపై బుధవారం డీటీసీలో శిక్షణ తరగతులు నిర్వహించారు. ఎన్నికల విధివిధానాలపై పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా పలు అంశాలను ఎస్పీ స్వయంగా వివరించారు. ఎన్నికల సమయంలో నేరాలు, అక్రమ ఆయుధాలు, మద్యం, నగదు, ఇతర వస్తువులను సీజ్ చేయడం తదితర అంశాలపై అధికారులకు అవగాహన కల్పించారు. ఎన్నికల విధుల నిర్వహణలో పోలీసుల సందేహాలను నివృత్తి చేశారు. ఎస్పీ మాట్లాడుతూ..ఎన్నికల నోటిఫికేషన్ విడుదలైన నాటి నుంచి ఎన్నికల ప్రక్రియ పూర్తిగా ముగిసే వరకు పోలీసు అధికారులు, సిబ్బంది సమన్వయంతో విధులు నిర్వహించాలని సూచించారు. ఎన్నికల కమిషన్ నియమ నిబంధనల మేరకు తమకు కేటాయించిన విధులు అంకితభావంతో నిర్వర్తించాలన్నారు. ఈ విషయంలో ఇతర శాఖల అధికారులు, సిబ్బందితో సమన్వయం చేసుకొని ఎన్నికలను సమర్థవంతంగా నిర్వహించేందుకు కృషి చేయాలన్నారు. అడిషనల్ ఎస్పీ (అడ్మిన్) కె.నాగేశ్వరరావు, డీఎస్‌బీ డీఎస్పీ బి.మరియదాసు, ట్రాఫిక్ డీఎస్పీ వి.శ్రీనివాసరావు, డీఎస్పీలు రామరాజు, వీరరాఘవరెడ్డి, సీహెచ్ శ్రీనివాసరావు, సీఐలు, ఎస్సైలు పాల్గొన్నారు.

ఎల్‌ఐసీలో వేతన సవరణ చేపట్టాలి

ఒంగోలు టౌన్: వేతన సవరణను వెంటనే చేపట్టాలని ఐసీఈయూ కార్యదర్శి పి.శ్రీనివాసరావు డిమాండ్ చేశారు. ఎల్‌ఐసీ జాయింట్ ఫ్రంట్ పిలుపు మేరకు బుధవారం మధ్యాహ్న భోజన విరామ సమయంలో ఒక గంటపాటు వాకౌట్ నిర్వహించారు. కొత్త పెన్షన్ స్కీములో ఉన్న ఉద్యోగులు మేనేజ్‌మెంట్ కాంట్రిబ్యూషన్‌ను 10 నుంచి 14 శాతానికి పెంచాలని, అన్నీ క్యాడర్లలో నియామకాలను చేపట్టడం ద్వారా పాలసీదారులకు మెరుగైన సేవలను అందించేలా చర్యలు తీసుకోవాలని కోరారు.

ఏసీబీ హడల్..

బల్ల కింద చేయి పెట్టడం.. ఇష్టానుసారంగా దోచుకోవడం.. ఇదీ కొంత మంది ప్రభుత్వాధికారుల తీరు. ఇలాంటి వారిపై నిఘా పెట్టింది ఏసీబీ. వరుసగా దాడులు చేస్తూ దూకుడు పెంచింది. అవినీతి అధికారుల భరతం పడుతోంది. వాళ్ల బాగోతాన్ని బయటపెడుతోంది. దీంతో ప్రభుత్వ కార్యాలయాల్లో ప్రకంపనలు సృష్టిస్తున్నాయి. అవినీతిపరుల గుండెల్లో రైళ్లు పరిగెడుతున్నాయి.



- దూకుడు పెంచిన అధికారులు
- వరుస దాడులతో అవినీతి అధికారుల గుండెల్లో గుబులు
- టోల్ ఫ్రీ నంబర్ 14400కు ఫిర్యాదుల వెల్లువ
- ఏడాది వ్యవధిలో ఏసీబీకి చిక్కిన నలుగురు ఎస్సైలు

మార్కాపురం: జిల్లాలో అవినీతి అధికారులపై ఏసీబీ అధికారులపై కొరడా ఝుళిపిస్తున్నారు. అవినీతి అధికారులను ట్రాప్ చేస్తూ రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకొని జైలుకు పంపుతున్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రాష్ట్రంలో అవినీతిని కూకటి వేళ్లతో పెకిలించేందుకు తీసుకుంటున్న చర్యలు సత్ఫలితాలిస్తున్నాయి. 14400 టోల్ ఫ్రీ నంబర్‌ను అందుబాటులోకి తెచ్చారు. ఉచితంగా అందించాల్సిన సేవలను లంచంతో ముడిపెట్టి ఇబ్బంది పెడుతున్న అధికారులపై టోల్ ఫ్రీ ద్వారా బాధితులు అధికారులకు ఫిర్యాదు చేస్తున్నారు. రంగంలోకి దిగుతున్న అధికారులు మారువేషాల్లో వెళుతూ అవినీతి పరుల అంతు చూస్తున్నారు. వారి అక్రమాస్తులపై కూడా దృష్టి సారిస్తున్నారు. కొత్త సంవత్సరంలో ఇప్పటి వరకూ మూడు ప్రాంతాల్లో దాడులు చేసి దూకుడు పెంచారు. ఒక ఎస్సైతో పాటుగా, వేర్వేరు తహసీల్దార్ కార్యాలయాలపై దాడులు చేసి వీఆర్వో, వీఆర్ఏలను వలపన్ని పట్టుకున్నారు. తాజాగా బుధవారం యర్రగొండపాలెం తహసీల్దార్ కార్యాలయంపై ఏసీబీ అధికారులు దాడులు చేయడంతో జిల్లాలోని అవినీతి అధికారుల గుండెల్లో రైళ్లు పరిగెడుతున్నాయి.

ఏసీబీ ట్రాప్‌లు ఇలా..

- ఈనెల 4వ తేదీన దర్శి ఎస్సై రామకృష్ణ ఫిర్యాదు దారుడైన రౌడీషీటర్ దగ్గర నుంచి డబ్బులు తీసుకుంటుండగా ఏసీబీ అధికారులు దాడులు నిర్వహించి పట్టుకొని అరెస్టు చేశారు.
- గత ఏడాది డిసెంబర్ 1వ తేదీన చీమకుర్తి మండలం చంద్రపాడు గ్రామానికి చెందిన కోటు శ్రీనివాసరావు, సోదరుడు అంకమ్మరావు, తల్లి రమణమ్మకు చెందిన భూమిని ఆన్‌లైన్ చేయమని దాదాపు రెండు నెలల నుంచి చంద్రపాడు సచివాలయం వద్ద వీఆర్వో వద్దకు తిరుగుతున్నారు. ఇన్‌చార్జి వీఆర్వో ఆన్‌లైన్ చేసేందుకు రూ.30 వేలు డిమాండ్ చేసి రూ.20 వేలకు బేరం కుదుర్చుకున్నారు. లంచం ఇవ్వడం ఇష్టం లేని శ్రీనివాసరావు, ఆయన తల్లి రమణమ్మ ఒంగోలు ఏసీబీ అధికారులను ఆశ్రయించారు. వల పన్నిన అధికారులు వీఆర్వో వెంకటరమణ, ఆయనకు సహకరించిన మరో వీఆర్వో సౌజన్యను అరెస్టు చేశారు.
- గత ఏడాది జూలై 19న ఘర్షణ కేసులో నిందితుల పేర్లను తొలగించేందుకు కొనకనమిట్ల ఎస్సై దీపిక డబ్బులు తీసుకుంటూ ఏసీబీ అధికారుల వలకు చిక్కారు.
- గత ఏడాది మే మొదటివారంలో కంభం సబ్ రిజిస్ట్రార్ శ్రీరామమూర్తి లంచం తీసుకుంటూ ఏసీబీ అధికారులకు పట్టుబడ్డాడు. దర్శిలోని ఆయన నివాసంలో కూడా అధికారులు సోదాలు చేశారు.
- కొండపి ఎస్సై రామకృష్ణ, కానిస్టేబుల్ కేసు నమోదు విషయంలో ఫిర్యాదు దారుడు దగ్గర నుంచి డబ్బులు డిమాండ్ చేయడంతో రెడ్ హ్యాండెడ్‌గా ఏసీబీ అధికారులకు పట్టుబడ్డాడు.
- తర్లుపాడు ఏఎస్సై ఒక కేసు విషయంలో డబ్బులు డిమాండ్ చేయగా బాధితుడు ఏసీబీని ఆశ్రయించడంతో ఆయన్ను కూడా పట్టుకున్నారు.

సంవత్సరం	నమోదైన ఏసీబీ కేసులు
2020	16
2021	11
2022	9
2023	6
2024	2 (ఇప్పటివరకూ)

రూ. 20 వేలు లంచం తీసుకుంటూ..

● ఏసీబీకి చిక్కిన వీఆర్వో, వీఆర్ఏ



నిందితులు వీఆర్వో కుమారనాయక్, వీఆర్ఏ జానీబాషా, వారి అనుచరుడు వెంకటేశ్వరరెడ్డి

యర్రగొండపాలెం: పొలం మ్యూటేషన్, పట్టాదారు పాస్ పుస్తకంలో ఉన్న తప్పులు సరిదిద్దేందుకు లంచం తీసుకుంటూ గంగపాలెం వీఆర్వో కుమారనాయక్, గురిజేపల్లి వీఆర్ఏ షేక్.జానీబాషా, వారి అనుచరుడు చింతలచెరువు వెంకటేశ్వరరెడ్డి ఏసీబీ వలకు చిక్కారు. రైతు నుంచి రూ.20 వేలు లంచం తీసుకుంటున్న సమయంలో ఏసీబీ అధికారులు పట్టుకున్నారు. యర్రగొండపాలెం తహశీల్దార్ కార్యాలయ ఆవరణలో బుధవారం జరిగిన ఈ సంఘటన వివరాలను ఏసీబీ డీఎస్పీ వి.శ్రీనివాసరావు వెల్లడించారు. త్రిపురాంతకం మండలం రామసముద్రానికి చెందిన రైతు నాగిరెడ్డి యర్రగొండపాలెం మండలంలోని రామచంద్రాపురం ఇలాకాలో తన తల్లి పేరుతో ఉన్న 1.45 ఎకరాల పొలాన్ని తన పేరుతో రిజిస్ట్రేషన్ చేయించుకున్నాడు. ఆ పొలానికి సంబంధించిన మ్యుటేషన్, పట్టాదారు పాస్ పుస్తకం తీసుకోవటానికి, అదే ఇలాకాలో తన తండ్రిపేరుతో ఉన్న 1.49 సెంట్ల భూమికి పట్టాదారు పాస్‌పుస్తకంలో ఉన్న తప్పులు సరిదిద్దేందుకు అర్జీ పెట్టుకున్నాడు. అందుకు వీఆర్వో కుమారనాయక్ రూ.25 వేలు లంచం అడిగి రూ. 20 వేలకు ఒప్పందం కుదుర్చుకున్నాడు. లంచం ఇచ్చేందుకు ఇష్టపడని నాగిరెడ్డి ఈ నెల 1న ఏసీబీ అధికారులను ఆశ్రయించాడు. దీనిపై ఏసీబీ అధికారులు ఈ నెల 6వ తేదీన యర్రగొండపాలెం వచ్చి విచారించి రైతు ఇచ్చిన ఫిర్యాదు సరైందని నిర్ధారించుకున్నారు. పథకం ప్రకారం బుధవారం దాడులు చేశామని డీఎస్పీ తెలిపారు. వీఆర్వో నేరుగా డబ్బులు తీసుకోకుండా వీఆర్ఏకు చెప్పాడని, వీఆర్ఏ వెంట ఉండే చింతల చెరువు వెంకటేశ్వరరెడ్డికి నాగిరెడ్డి నుంచి డబ్బులు తీసుకోమని చెప్పాడన్నారు. అతను డబ్బులు తీసుకుంటున్న సమయంలో దాడులు చేశామన్నారు. ఈ కేసులో ముగ్గురిని నిందితులుగా కేసు నమోదు చేసి విచారిస్తున్నామని తెలిపారు. అవినీతికి పాల్పడే వారిపై 14400 నంబర్‌కు ఫోన్‌చేసి ఫిర్యాదు చేయాలని, వారిపేర్లు గోప్యంగా ఉంచుతామన్నారు. దాడుల్లో సీఐ ఎస్ఎస్ఎస్ అపర్ణ, సీహెచ్ శేషు, ఎస్సై జేబీఎస్ ప్రసాద్ పాల్గొన్నారు.

రైతులుగా లుంగీలు కట్టుకొని...

ఏసీబీ అధికారులు దాడులు చేసే సమయంలో ఇద్దరు కానిస్టేబుళ్లు లుంగీలు కట్టుకొని, తలకు కండువ చుట్టుకొని రైతుల్లా వేషం కట్టారు. తహశీల్దార్ కార్యాలయంలో పని ఉన్నట్టుగా వచ్చారు. ఆవరణలో నిలబడి ఉన్నారు. నిందితులు లంచం తీసుకుంటున్న సమయంలో మఫ్టీలో ఉన్న వారు దాడులు జరిపారు. వారిమధ్య కాసేపు తోపులాట జరిగింది. అక్కడ ఉన్న పలువురు వారిని వారించడంతో తాము ఏసీబీ సిబ్బందని చెప్పాల్సి వచ్చింది.



నిందితుడిని పట్టుకుంటున్న ఏసీబీ సిబ్బంది (లుంగీలతో ఉన్న వ్యక్తులు)

టోల్ ఫ్రీ నంబర్‌కు ఫిర్యాదు చేయండి



ఉచితంగా ప్రభుత్వ సేవలు అందించాల్సిన అధికారులు, సిబ్బంది ఎవరైనా లంచాలు అడుగుతూ ఇబ్బంది పెట్టినా, అక్రమాస్తులు కలిగి ఉన్నాడన్న సమాచారం తెలిసినా టోల్‌ఫ్రీ నంబర్ 14400కు ఫిర్యాదు చేయొచ్చు. వారి వివరాలను అత్యంత గోప్యంగా ఉంచుతారు. ఒంగోలులోని భాగ్యనగర్‌లో ఉన్న ఏసీబీ కార్యాలయంలో కూడా ఫిర్యాదు చేయవచ్చు. అయితే తప్పుడు ఫిర్యాదులు, బ్లాక్‌మెయిల్ ఫిర్యాదులు వద్దు.

– వి.శ్రీనివాసరావు, డీఎస్పీ, ఏసీబీ, ఒంగోలు

అంబేడ్కర్ విగ్రహావిష్కరణకు భారీగా తరలిరండి

● రాష్ట్ర పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి సురేష్



మాట్లాడుతున్న మంత్రి ఆదిమూలపు సురేష్, పాల్గొన్న నేతలు

సింగరాయకొండ: విజయవాడ నడిబొడ్డున స్వరాజ్ మైదానంలో రూ.400 కోట్లతో నిర్మించిన 125 అడుగుల అంబేడ్కర్ విగ్రహావిష్కరణ కార్యక్రమానికి నియోజకవర్గం నుంచి భారీగా తరలిరావాలని రాష్ట్ర పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి, వైఎస్సార్ సీపీ కొండపి నియోజకవర్గ ఇన్‌చార్జి డాక్టర్ ఆదిమూలపు సురేష్ పిలుపునిచ్చారు. ఒంగోలులోని ఎంఎస్ ఫంక్షన్ హాలులో బుధవారం డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహావిష్కరణకు సంబంధించి నియోజకవర్గ స్థాయి సమీక్ష సమావేశంలో మంత్రి మాట్లాడారు. దళితులతో పాటు అన్ని వర్గాలకు ఆరాధ్య దైవమైన రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ 125 అడుగుల విగ్రహ ప్రతిష్ట కార్యక్రమాన్ని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అత్యంత ప్రతిష్టాత్మకంగా తీసుకున్నారన్నారు. వేల కోట్ల విలువైన స్థలంలో అంబేడ్కర్ విగ్రహ ఏర్పాటు చేయడం దళితులపై జగన్‌మోహన్‌రెడ్డికి ఉన్న గౌరవాన్ని తెలియజేస్తుందన్నారు. అంబేడ్కర్ విగ్రహ ఏర్పాటుకు మంత్రుల సబ్ కమిటీని వేశారని, ఈ కమిటీలో రాష్ట్ర సాంఘిక, సంక్షేమ శాఖ మంత్రి మేరుగు నాగార్జున, రాష్ట్ర దేవదాయ, ధర్మాదాయ శాఖ మంత్రి కొట్టు సత్యన్నారాయణ, ఉప ముఖ్యమంత్రి నారాయణస్వామి, రాష్ట్ర గృహ నిర్మాణ శాఖా మంత్రి జోగి రమేష్ తో పాటు తాను కూడా ఉన్నానని పేర్కొన్నారు. విగ్రహ ప్రతిష్టలో పురపాలక శాఖా మంత్రిగా తన పర్యవేక్షణలో విగ్రహ పరిసరాలను అత్యంత సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దానని వివరించారు. విగ్రహావిష్కరణ కార్యక్రమాన్ని ఒలంపిక్, వరల్డ్‌కప్ స్థాయిలో కన్నుల పండువగా నిర్వహిస్తామన్నారు. 2017లో అమరావతి సమీపంలోని మారుమూల గ్రామమైన ఐనవోలులో 125 అడుగుల భారీ విగ్రహాన్ని నిర్మిస్తానని గ్రాఫిక్స్ చూపించాడని, కానీ జగనన్న ఖరీదైన స్థలంలో నిర్మించి చూపించారని కొనియాడారు. ఇదే చంద్రబాబుకు, వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి ఉన్న వ్యత్యాసమని మంత్రి సురేష్ పేర్కొన్నారు. అంతకుముందు మంత్రి సురేష్ అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. వైఎస్సార్ సీపీ వైద్య విభాగం రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ బత్తుల అశోక్‌కుమార్‌రెడ్డి, జెడ్పీటీసీలు మారెడ్డి అరుణకుమారి, బెజవాడ వెంకటేశ్వర్లు, ఎంపీపీ వాకా వెంకటరెడ్డి, పార్టీ మండల అధ్యక్షుడు సామంతుల రవికుమార్‌రెడ్డి, పి.బాలకోటిరెడ్డి, బత్తిన మదన మనోహర్, మల్లవరపు రాఘవరెడ్డి, వైస్ ఎంపీపీ షేక్ షకీల, రాష్ట్ర సహాయ కార్యదర్శి దాకా పిచ్చిరెడ్డి, వడ్డెర కార్పొరేషన్ డైరెక్టర్ యనమల మాధవి, యువజన విభాగం కార్యదర్శి శీలం రాము, షేక్ నౌషాద్, మండల జేసీఎస్ కన్వీనర్లు చింతపల్లి హరిబాబు, గొట్టిపాటి మురళి, తన్నీరు సుబ్బారావు, తాటికొండ రామచంద్రరావు, సంజీవరెడ్డి, మాజీ ఎంపీపీ బెల్లం సత్యన్నారాయణ, మాజీ ఏఎంసీ చైర్మన్ రాపూరి ప్రభావతి, భాస్కరరెడ్డి, ఆనం సత్యన్నారాయణరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

గణతంత్ర దినోత్సవానికి పకడ్బందీ ఏర్పాట్లు

● కలెక్టర్ దినేష్‌కుమార్



మాట్లాడుతున్న కలెక్టర్ దినేష్‌కుమార్

ఒంగోలు అర్బన్: గణతంత్ర దినోత్సవానికి పకడ్బందీగా ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ ఏఎస్ దినేష్‌కుమార్ అధికారులను ఆదేశించారు. ప్రకాశంభవనంలో వేడుకల ఏర్పాటుపై తీసుకోవాల్సిన చర్యలపై బుధవారం అన్ని శాఖల అధికారులతో సమావేశం నిర్వహించారు. సమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూ గణతంత్ర దినోత్సవ వేడుకల నిర్వహణలో లోపాలు లేకుండా శ్రద్ధ వహించి తగిన చర్యలు తీసుకోవాలన్నారు. అతిథులను ఆహ్వానించడంలో ప్రొటోకాల్ ఉల్లంఘన జరగకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. సీటింగ్, స్టాల్స్ ఏర్పాటు విషయంలో ప్రత్యేక శ్రద్ధ వహించాలన్నారు. స్వాతంత్ర్య సమరయోధులు, వారి కుటుంబసభ్యులను కార్యక్రమాలు వీక్షించేందుకు ప్రత్యేకంగా ఆహ్వానించాలన్నారు. ప్రభుత్వ పథకాలు, ఆయా శాఖల్లో సాధించిన విజయాలను తెలిపేలా శకటాలను రూపొందించాలని ఆదేశించారు. పెరేడ్ గ్రౌండ్‌లో ప్రదర్శన అనంతరం శకటాలు నగరంలోనూ ప్రదర్శించేలా ట్రాఫిక్ నియంత్రణకు చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో భాగంగా నిర్వహించే సాంస్కృతిక కార్యక్రమాల్లో జిల్లాలో దూర ప్రాంత విద్యార్థులు కూడా పాల్గొనేలా చూడాలని సూచించారు. ప్రాంగణంలో వేడుకలు పూర్తయ్యే వరకు అగ్నిమాపక, వైద్య సదుపాయాలు అందుబాటులో ఉంచాలన్నారు. అక్కడికి వచ్చే వారికి తాగునీరు, స్నాక్స్ వంటివి సరఫరా చేయడంలో ఇబ్బందులు లేకుండా ముందస్తు జాగ్రత్త చర్యలు తీసుకోవాలన్నారు. సచివాలయాల నుంచి కలెక్టరేట్ వరకు అన్నీ ప్రభుత్వ కార్యాలయాల్లో గణతంత్ర వేడుకలు జరిగేలా చర్యలు తీసుకోవాలన్నారు. సమావేశంలో ఏఎస్పీ అశోక్‌బాబు, అన్ని శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

స్కానింగ్ సెంటర్ల అనుమతుల్లో నిబంధనలు పాటించాలి

● కలెక్టర్ దినేష్‌కుమార్

ఒంగోలు అర్బన్: స్కానింగ్ సెంటర్ల నిర్వహణకు అవసరమైన అనుమతులు మంజూరులో నిబంధనలు పాటించాలని, ఉల్లంఘిస్తే చర్యలు తప్పవని కలెక్టర్ దినేష్‌కుమార్ హెచ్చరించారు. ప్రకాశంభవనంలో బుధవారం జిల్లా స్థాయి కమిటీ సమావేశం నిర్వహించారు. సమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూ స్కానింగ్ కేంద్రాల్లో లింగ నిర్ధారణ పరీక్షల్లో అవకతవకలు, అక్రమాలు జరగకుండా చర్యలు తీసుకోఆలన్నారు. వాటికి సంబంధించిన అనుమతుల మంజూరుతో పాటు పునరుద్ధరణ సమయంలో అవసరమైన తనిఖీలు పకడ్బందీగా చేయాలన్నారు. నిబంధనలు ఉల్లంఘిస్తే స్కానింగ్ సెంటర్లకు నోటీసులు జారీ చేయాలని ఆదేశించారు. సమావేశంలో ఏఎస్పీ నాగేశ్వరరావు, డీఎంహెచ్ఓ రాజ్యలక్ష్మి, ప్రోగ్రాం అధికారి భగీరథి, ఎస్ఏఆర్‌డీఎస్ ప్రోగ్రాం మేనేజర్ లక్ష్మీ ఇతర అధికారులు పాల్గొన్నారు.

జాతీయస్థాయి ఎడ్ల పోటీలు ప్రారంభం



పూజలు చేసి పోటీలను ప్రారంభిస్తున్న మంత్రులు మేరుగు నాగార్జున, ఆదిమూలపు సురేష్, జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ తదితరులు



ఎడ్ల పోటీలను తిలకిస్తున్న అభిమానులు



కార్యకర్తలను ఉత్సాహపరుస్తున్న బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి

- ప్రత్యేక పూజలు చేసి మంత్రుల చేతుల మీదుగా ప్రారంభించిన బూచేపల్లి
- భారీగా హాజరైన జనసందోహం
- తొలిరోజు పోటీల్లో 18 జతల ఎడ్లు

దర్శి: జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ, మాజీ ఎమ్మెల్యే బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డిల ఆధ్వర్యంలో జాతీయస్థాయి ఒంగోలు జాతి ఎడ్ల బల ప్రదర్శన పోటీలు దర్శిలోని బూచేపల్లి నివాసం వద్ద బుధవారం ప్రారంభమయ్యాయి. పోటీలకు రాష్ట్ర సాంఘిక శాఖ మంత్రి మేరుగు నాగార్జున, రాష్ట్ర పురపాలక పట్టణాభివృద్ధి శాఖ మంత్రి ఆదిమూలపు సురేష్ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. తొలుత జ్యోతిప్రజ్వలన చేసి పోటీలను ప్రారంభించారు. పోటీలకు హాజరైన ఎడ్ల జతల యజమానులను ఘనంగా సన్మానించారు. తొలి రోజు రెండు తెలుగు రాష్ట్రాల నుంచి 18 జతల ఎడ్లు పాల్గొన్నాయి. తొలుత చంద్ర కోలుతో బండ లాగించి మంత్రులు మేరుగ నాగార్జున, ఆదిమూలపు సురేష్, బూచేపల్లి వెంకాయమ్మ, శివప్రసాద్‌రెడ్డిలు కార్యకర్తల్లో ఉత్సాహాన్ని నింపారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో మంత్రులు మాట్లాడుతూ బూచేపల్లి కుటుంబం 25 ఏళ్ల నుంచి దర్శి ప్రజల మన్ననలు పొందుతున్నారన్నారు. జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ మాట్లాడుతూ ఆ నాటి రాజన్న పాలన జగనన్నకే సాధ్యమైందన్నారు. పేదలను ఆదుకోవడంలో, అభిమానం పంచడంలో బూచేపల్లి కుటుంబం ఎల్లప్పుడూ ముందుంటుందని చెప్పారు. మేనిఫెస్టోలో ఇచ్చిన 100శాతం హామీలు అమలు చేసిన సీఎం దేశంలో ఒక్క జగనన్నే అని చెప్పారు. రానున్న ఎన్నికల్లో 175 స్థానాలు అత్యధిక మెజార్టీతో గెలవడం ఖాయమని స్పష్టం చేశారు. మాజీ ఎమ్మెల్యే డాక్టర్ బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి మాట్లాడుతూ బూచేపల్లి కుటుంబం వైఎస్సార్ సీపీ కార్యకర్తలకు ఎప్పుడూ అండంగా ఉంటుందన్నారు. మాట తప్పని మడమ తిప్పని నాయకుడు దేశంలో ఒక్క సీఎం జగన్ మాత్రమే అన్నారు. పేదల అభ్యున్నతే ధ్యేయంగా సీఎం ఎన్నో పథకాలను ప్రవేశపెట్టారన్నారు. 40 ఏళ్ల ఇండస్ట్రీ అని చెప్పుకునే చంద్రబాబు.ఒక్క జగన్‌ను ఎదుర్కొనే ధైర్యం లేక పవన్‌ను ఇతర పార్టీలతో పొత్తు పెట్టుకున్నారన్నారు. ఎంతమంది కలిసి వచ్చినా సీఎం జగన్‌ను ఏం చేయలేరన్నారు. కార్యక్రమంలో షేక్ కార్పొరేషన్ డైరెక్టర్, వైద్యవిభాగం రాష్ట్ర అధికార ప్రతినిధి డాక్టర్ ఎస్ఎం బాషా, మండల కన్వీనర్ వెన్నపూస వెంకటరెడ్డి, గ్రీనరీ అండ్ బ్యూటిఫికేషన్ డైరెక్టర్ కుమ్మిత అంజిరెడ్డి, దర్శి, దొనకొండ ఎంపీపీలు సుధా అచ్చయ్య, బొరిగొర్ల ఉషారాణి, కౌన్సిలర్‌లు మేడం మోహన్‌రెడ్డి, జగన్నాథం మోహన్ బాబు, తుళ్లూరి బాబురావు, ఆవుల జ్యోతి శివారెడ్డి, వైస్ ఎంపీపీ సోము దుర్గారెడ్డి, జెడ్పీటీసీ నాగిరెడ్డి, ఎస్సీసెల్ జిల్లా అధ్యక్షుడు గాలిమూటి దేవప్రసాద్, ఎంపీటీసీ సంఘ జిల్లా అధ్యక్షుడు బండి గోపాల్‌రెడ్డి, సర్పంచ్‌లు, ఇతర నేతలు పాల్గొన్నారు.

క్లుప్తంగా

12న జరుగుమల్లిలో కలెక్టర్ 'స్పందన'

జరుగుమల్లి: జరుగుమల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో ఈ నెల 12న స్పందన కార్యక్రమం నిర్వహించనున్నట్లు తహసీల్దార్ ఎస్.ఉషారాణి తెలిపారు. రాష్ట్ర పురపాలక శాఖా మంత్రి, వైఎస్సార్ సీపీ కొండపి ఇన్‌చార్జి డాక్టర్ ఆదిమూలపు సురేష్ సమక్షంలో, కలెక్టర్ దినేష్ కుమార్ అధ్యక్షతన స్పందన నిర్వహించనున్నట్లు వివరించారు. మండల స్థాయి అధికారులు తమ నివేదికలతో హాజరు కావాలని సూచించారు. మండలంలోని ప్రజలు తమ సమస్యలను స్పందనలో తెలియజేయవచ్చని చెప్పారు.

14 నుంచి గొట్లగట్టులో జిల్లా స్థాయి కబడ్డీ పోటీలు

కొనకనమిట్ల: సంక్రాంతి పండగ సందర్భంగా కొనకనమిట్ల మండలం గొట్లగట్టు గ్రామంలో ఈ నెల 14 నుంచి 16వ తేదీ వరకు ఉమ్మడి ప్రకాశం జిల్లా స్థాయి కబడ్డీ పోటీలు నిర్వహించనున్నట్లు కమిటీ సభ్యులు తెలిపారు. ఎమ్మెల్యే కేపీ నాగార్జునరెడ్డి, మాజీ ఎమ్మెల్యే ఉడుముల శ్రీనివాసులరెడ్డి సహకారంతో పోటీలు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. విజేతలకు మొదటి, రెండు, మూడు, నాలుగో బహుమతులు వరుసగా రూ.25 వేలు, రూ.20 వేలు, రూ.15 వేలు, రూ.10 వేలతో పాటు మెమొంటో షీల్డ్‌లు దాతల సహకారంతో అందజేస్తామన్నారు. వివరాలకు 99123 12365, 9705347598ను సంప్రదించాలని సూచించారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతి


ఘటనా స్థలంలో శ్రీనివాసులు మృతదేహం

తర్లుపాడు: స్కూటీని గుర్తు తెలియని వాహనం ఢీకొనడంతో ఓ వ్యక్తి అక్కడికక్కడే మృతి చెందాడు. ఈ సంఘటన తర్లుపాడు మండలంలోని సీతానాగులవరం వద్ద బుధవారం మధ్యాహ్నం చోటుచేసుకుంది. ఏఎస్సై రామకృష్ణారెడ్డి కథనం మేరకు.. కంభం మండలం తురిమెళ్ల గ్రామానికి చెందిన గన్నారపు శ్రీనివాసులు(48) మార్కాపురంలో తోపుడు బండితో చిరువ్యాపారం చేసుకుంటున్నాడు. స్కూటీపై బంధువుల ఇంటికి వెళ్తున్న క్రమంలో ఎదురుగా వచ్చిన గుర్తు తెలియని వాహనం ఢీకొట్టడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. మృతదేహాన్ని పోస్ట్‌మార్టం నిమిత్తం మార్కాపురం జిల్లా వైద్యశాలకు తరలించారు. విషయం తెలుసుకున్న కుటుంబ సభ్యులు జిల్లా వైద్యశాలకు చేరుకుని కన్నీరుమున్నీరయ్యారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్సై తెలిపారు.

యువోత్సాహం

ఆడుదాం ఆంధ్రా క్రీడా పోటీల్లో యువత ఉత్సాహంగా పాల్గొంటున్నారు. 'ఇది అందరి ఆట' నినాదంతో రాష్ట్ర ప్రభుత్వం నిర్వహిస్తున్న క్రీడా సంబరాల్లో భాగంగా బుధవారం మండల స్థాయి పోటీలు అట్టహాసంగా ప్రారంభమయ్యాయి. ప్రజాప్రతినిధులు, అధికారులు పోటీలను ఆరంభించి పర్యవేక్షించారు. - సాక్షి నెట్‌వర్క్


కనిగిరిలో ఉత్సాహంగా ఖోఖో ఆడుతున్న క్రీడాకారిణులు


ముండ్లమూరులో క్రికెట్ మ్యాచ్‌లో తలపడుతున్న పెదఉల్లగల్లు-పసుపుగల్లు జట్లు


మద్దిపాడులో గుండ్లాపల్లి-ఘడియాపూడి జట్ల మధ్య నువ్వా.. నేనా అన్నట్లు సాగుతున్న కబడ్డీ మ్యాచ్


ఒంగోలు మినీ స్టేడియంలో షటిల్ బ్యాడ్మింటన్ ఆడుతున్న విరాట్‌నగర్, రాజపానగల్ రోడ్-2 సచివాలయం మహిళా జట్లు


షటిల్ బ్యాడ్మింటన్ ఆడుతున్న గద్దలగుంట-1, గద్దలగుంట-2 సచివాలయం పురుషుల జట్లు


మార్కాపురం : కబడ్డీ ఆడుతున్న చింతగుంట్ల-బోడపాడు జట్లు


కొండపిలో కబడ్డీ ఆడుతున్న బాలికలు


పెద్దదోర్నాలలో హోరాహోరీగా సాగుతున్న వాలీబాల్ పోటీ..


కంభంలో వాలీబాల్ ఆడుతున్న క్రీడాకారులు, ఆసక్తిగా తిలకిస్తున్న క్రీడాభిమానులు

స్మృతి వనం.. మరో చారిత్రక ఘట్టం


విలేకరులతో మాట్లాడుతున్న ఎస్సీ కమిషన్ చైర్మన్ విక్టర్‌ప్రసాద్

- 125 అడుగుల అంబేడ్కర్ విగ్రహావిష్కరణకు భారీగా తరలిరండి
- రాష్ట్ర ఎస్సీ కమిషన్ చైర్మన్ విక్టర్ ప్రసాద్

ఒంగోలు సెంట్రల్: విజయవాడ నడిబొడ్డున రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ 125 అడుగుల విగ్రహాన్ని సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆవిష్కరించడం చారిత్రాత్మక ఘట్టమని రాష్ట్ర ఎస్సీ కమిషన్ చైర్మన్ ఎం.విక్టర్ ప్రసాద్ పేర్కొన్నారు. ఒంగోలు ఆర్‌అండ్‌బీ అతిథి గృహ ప్రాంగణంలో బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. రూ.400 కోట్లతో 125 అడుగుల ఎత్తుతో నిర్మించిన అంబేడ్కర్ విగ్రహావిష్కరణకు ప్రతి ఒక్కరూ తరలిరావాలన్నారు. అంబేడ్కర్ అందరివాడని, ఒక వర్గానికో, కులానికో మతానికో సంబంధించిన వ్యక్తి కాదన్నారు. మహోన్నతమైన రాజ్యాంగాన్ని రచించి దేశ ప్రజలకు స్వేచ్ఛ, సమానత్వం, సమన్యాయం సౌభ్రాతత్వాన్ని అందించిన గొప్ప వ్యక్తి అని కొనియాడారు. ఈ విగ్రహావిష్కరణను దేశ చరిత్రలో మహోన్నతమైన ఘట్టంగా అభివర్ణించారు. స్మృతివనం ప్రపంచ పర్యాటక ప్రదేశంగా రూపుదిద్దుకుంటోందన్నారు. గత ప్రభుత్వంలో అంబేడ్కర్ విగ్రహ ఏర్పాటుపై చంద్రబాబు మాటలకే పరిమితమైతే.. సీఎం వైఎస్ జగన్ చేతల్లో చూపించారన్నారు. రాష్ట్రానికి బిజినెస్, పొలిటికల్ సెంటర్‌లో అంబేడ్కర్ విగ్రహం ఏర్పాటు చేయడంపై సీఎంకు ప్రత్యేక కృతజ్ఞతలు చెప్పాలని పిలుపునిచ్చారు. కార్యక్రమ నిర్వహణపై సోషల్ మీడియాలోనూ విస్తృత ప్రచారం చేయాలని కోరారు. ఎస్సీ కార్పొరేషన్ ఈడీ అర్జున్‌నాయక్, సాంఘిక సంక్షేమాధికారి లక్ష్మానాయక్, సంక్షేమ వసతి గృహ సంఘ జిల్లా అధ్యక్షుడు అంకబాబు, సెక్రటరీ లింగయ్య, జిల్లా విజిలెన్స్ కమిటీ మెంబర్ రమణమ్మ, బిళ్లా చెన్నయ్య, కంకణాల ఆంజనేయులు, ఇతర ప్రజా సంఘాల నాయకులు పాల్గొన్నారు.

అంబేడ్కర్ సేవలు ప్రజలకు తెలియాలి

- ఈ నెల 9 నుంచి 18వ తేదీ వరకు వివిధ కార్యక్రమాలు
- అంబేడ్కర్ ఫొటో ఎగ్జిబిషన్‌ను ప్రారంభించిన కలెక్టర్ దినేష్‌కుమార్

ఒంగోలు అర్బన్:

సామాజిక న్యాయం కోసం డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ చేసిన కృషి, అందించిన సేవలు ప్రజలందరికీ తెలియాల్సిన ఆవశ్యకత ఉందని కలెక్టర్ ఏఎస్ దినేష్‌కుమార్ పేర్కొన్నారు. బుధవారం ప్రకాశం భవనంలో డీఆర్‌డీఏ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన అంబేడ్కర్ ఫొటో ఎగ్జిబిషన్‌ను కలెక్టర్ ప్రారంభించి ఆసక్తిగా తిలకించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. జన్ భాగీదారీ కార్యక్రమంలో భాగంగా ఈ నెల 9వ తేదీ నుంచి 18వ తేదీ వరకు కలెక్టరేట్‌లో వివిధ కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అందులో భాగంగానే ఫొటో ఎగ్జిబిషన్ ఏర్పాటు చేశామన్నారు. జిల్లా కేంద్రంతో పాటు డివిజన్, మండల, గ్రామ స్థాయి వరకు 10 రోజులపాటు పలు కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. అనంతరం స్పందన హాల్లో విద్యాశాఖ, సాంఘిక సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో అంబేడ్కర్ జీవిత చరిత్రను తెలిపే సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. ఒంగోలు బండ్లమిట్ట బాలికల పాఠశాల విద్యార్థినులతోపాటు పలు ప్రైవేటు పాఠశాలల విద్యార్థులు, గాయకులు, కళాకారుల ప్రదర్శన ఆహూతులను అలరించింది. దీనిలో డీఆర్‌డీఏ పీడీ వసుంధర, డీపీఓ నారాయణరెడ్డి, డీఈఓ సుబ్బారావు, సాంఘిక సంక్షేమ శాఖాధికారి లక్ష్మానాయక్, ఇతర అధికారులు పాల్గొన్నారు.


అంబేడ్కర్ ఫొటో ఎగ్జిబిషన్‌ను తిలకిస్తున్న కలెక్టర్ దినేష్‌కుమార్, డీపీఓ నారాయణరెడ్డి తదితరులు


చిన్నారుల నృత్య ప్రదర్శన

జన శిక్షణ సంస్థాన్ సందర్శన


జనశిక్షణ సంస్థాన్ వివరాలు తెలుసుకుంటున్న ఏకేయూ విద్యార్థులు

ఒంగోలు: జన శిక్షణ సంస్థాన్‌ను ఒంగోలు ఆంధ్ర కేసరి విశ్వవిద్యాలయం సోషల్ వర్క్ విభాగం విద్యార్థులు బుధవారం సందర్శించారు. జనశిక్షణా సంస్థాన్ పనితీరును ఆ సంస్థ డైరెక్టర్ కె.శ్యాంసునీల్ వివరించారు. నైపుణ్యాభివృద్ధి, ఔత్సాహిక మంత్రిత్వశాఖ ఆధ్వర్యంలో తమ సంస్థ పనిచేస్తుందని, దేశవ్యాప్తంగా 288 కార్యాలయాలు ఉన్నాయని, ప్రాంతీయ అవసరాలను తీర్చడమే కాకుండా ఆర్థికాభివృద్ధివైపు ప్రజలను నడిపించడంలో ప్రధాన పాత్ర పోషిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఏకేయూ సోషల్ వర్క్ ప్రొఫెసర్లు వెంకట్రావు, శ్రీనివాస్, డాక్టర్ హర్షప్రీతమ్‌దేవ్‌కుమార్, జన శిక్షణ సంస్థాన్ ప్రోగ్రాం ఆఫీసర్లు డి.రాజేంద్రప్రసాద్, ఎం.హరికృష్ణ రాజు, ఇన్‌స్పెక్టర్ ఎం.నాగమల్లీశ్వరి పాల్గొన్నారు.

ఏకేయూ ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్‌గా హర్షప్రీతమ్


వీసీ నుంచి నియామకపత్రం అందుకుంటున్న డాక్టర్ హర్షప్రీతమ్

ఒంగోలు: ఆంధ్రకేసరి విశ్వవిద్యాలయం ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్‌గా అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ హర్షప్రీతమ్ దేవ్ కుమార్ నియమితులయ్యారు. ఈ మేరకు ఆయన బుధవారం స్థానిక విశ్వవిద్యాలయంలో వైస్ చాన్స్‌లర్, ప్రొఫెసర్ మారెడ్డి అంజిరెడ్డి, రిజిస్ట్రార్ బి.హరిబాబు చేతులమీదుగా నియామక పత్రాన్ని అందుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సామాజిక సేవలో, సామాజిక బాధ్యతలను గుర్తెరిగి విద్యార్థులను మంచి పౌరులుగా సమాజానికి అందించేందుకు కృషి చేస్తానన్నారు. ఈ సందర్భంగా హర్ష ప్రీతమ్‌దేవ్ కుమార్‌ను ప్రిన్సిపాల్, ప్రొఫెసర్ జి.రాజమోహన్, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్.నిర్మలామణి, సహాయక ఆచార్యులు డాక్టర్ పి.వెంకట్రావు, డాక్టర్ ఆర్.శ్రీనివాసులు, డాక్టర్ ఎస్.సురేష్ తదితరులు అభినందించారు.

గిరిజనులకు పూర్తి స్థాయిలో రక్త పరీక్షలు

- సికిల్‌సెల్ అనీమియాపై విస్తృతంగా అవగాహన కల్పించాలి
- వైద్య శాఖాధికారుల సమీక్షలో కలెక్టర్ దినేష్‌కుమార్


వైద్య శాఖ అధికారులతో సమీక్షిస్తున్న కలెక్టర్ దినేష్‌కుమార్

ఒంగోలు అర్బన్: సికిల్‌సెల్ అనీమియా వ్యాధిపై ప్రజలకు విస్తృతంగా అవగాహన కల్పించాలని, ముఖ్యంగా గిరిజన ప్రాంతాల్లో పూర్తి స్థాయిలో వైద్య పరీక్షలు నిర్వహించాలని కలెక్టర్ ఏఎస్ దినేష్ కుమార్ సంబంధిత అధికారులను ఆదేశించారు. బుధవారం ప్రకాశం భవనంలో వైద్య ఆరోగ్య శాఖ అధికారులతో కలెక్టర్ సమీక్షించారు. కలెక్టర్ మాట్లాడుతూ.. ఫిబ్రవరి చివరినాటికి జిల్లాలోని గిరిజన ప్రాంతాల్లో పూర్తి స్థాయిలో రక్త పరీక్షలు నిర్వహించాలని చెప్పారు. వ్యాధి లక్షణాలు, వ్యాపించే అవకాశాలపై అన్ని గిరిజన గ్రామాలు, పాఠశాలలు, కళాశాలల్లో విస్తృత స్థాయిలో అవగాహన కార్యక్రమాలు చేపట్టాలన్నారు. బీటీ, కుష్టు, ఎయిడ్స్ వ్యాధి నివారణ అధికారి సురేష్ మాట్లాడుతూ.. జన్యుపరంగా ఈ వ్యాధి వస్తుందన్నారు. లక్షణాలు ఏవీ లేని సికిల్ సెల్ క్యారియర్ మరో సికిల్ సెల్ క్యారియర్‌ను వివాహం చేసుకుంటే సంతానానికి కూడా ఈ వ్యాధి సంక్రమిస్తుందన్నారు. ముఖ్యంగా గిరిజన ప్రాంతాల్లో ఈ పరిస్థితి కనిపిస్తుందన్నారు. జిల్లాలో గిరిజనులు 14,623 మందికి రక్తపరీక్షలు చేసేందుకు 12,613 కిట్లు వచ్చాయని తెలిపారు. 126 మంది ఏఎన్ఎంలు, 15 మంది మెడికల్ ఆఫీసర్లకు ఇప్పటికే శిక్షణ ఇచ్చామన్నారు. ఇప్పటి వరకు 260 మందికి రక్త పరీక్షలు నిర్వహించి ఒకరిని క్యారియర్‌గా గుర్తించామన్నారు. సమావేశంలో డీఎంహెచ్ఓ రాజ్యలక్ష్మి, ఐసీడీఎస్ పీడీ మాధురి, డీఈఓ సుబ్బారావు, సాంఘిక సంక్షేమ అధికారి లక్ష్మానాయక్, గిరిజన సంక్షేమ అధికారులు, రెడ్‌క్రాస్ సిబ్బంది పాల్గొన్నారు.

టీడీపీ నేత భూఆక్రమణపై సబ్‌కలెక్టర్ విచారణ


సబ్‌కలెక్టర్ రాహుల్‌మీనాకు సమస్యను వివరిస్తున్న దళితులు

మార్కాపురం రూరల్: మార్కాపురం పట్టణ శివారులోని నరసింహాపురంలో 470 నుంచి 483 వరకు సర్వే నంబర్లలో దళితులకు చెందిన 41.58 ఎకరాల భూమిని టీడీపీ నేత ఆక్రమించాడని చేబ్రోలు ఐజాక్ ఇచ్చిన ఫిర్యాదుపై జాయింట్ కలెక్టర్ ఆదేశాల మేరకు సబ్ కలెక్టర్ రాహుల్‌మీనా బుధవారం పొలం దగ్గరకు వెళ్లి పరిశీలించారు. ఈ సందర్భంగా భూమి ఆక్రమించిన తీరును సబ్‌కలెక్టర్ ఎదుట ఐజాక్ వివరించారు. 2007లో ఎస్సీ కార్పొరేషన్ ద్వారా ఒక్కొక్కరికి 4 ఎకరాల చొప్పున భూమి కేటాయించారని తెలిపారు. కాగా పట్టణానికి చెందిన టీడీపీ నాయకుడు, అప్పటి కౌన్సిలర్ 2016లో పొలాన్ని తనపేరున ఆన్‌లైన్ చేయించుకున్నాడని చెప్పారు. అప్పటి నుంచి పొలాన్ని అప్పగించాలని పలుమార్లు ఆర్డీవో కార్యాలయం ఎదుట ధర్నాలు, నిరాహార దీక్షలు చేసినా స్పందించలేదని వివరించారు. అప్పటి నుంచి నేటి వరకు పొలాన్ని సాగు చేసుకుంటున్నామని ఐజాక్ తెలిపారు. దళితులమైన తమపై దౌర్జన్యాలకు పాల్పడుతున్నారని చెప్పారు. ప్రైవేట్ వ్యక్తులతో బెదింపులకు పాల్పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. దళితులమైన తమకు న్యాయం చేయాలని, లేదంటే ఆత్మహత్యే శరణ్యమని వాపోయారు. దీనిపై సబ్‌కలెక్టర్ స్పందిస్తూ పూర్తి స్థాయిలో విచారణ చేపట్టి ప్రభుత్వానికి నివేదిక అందిస్తామన్నారు. ఆయన వెంట మార్కాపురం తహసీల్దార్ మంజునాథరెడ్డి, సర్వేయర్లు, వీఆర్‌ఓలు ఉన్నారు.

రైలు కింద పడి వ్యక్తి మృతి

గిద్దలూరు రూరల్: గూడ్సు రైలు కింద పడి ఓ వ్యక్తి మృతి చెందిన సంఘటన పట్టణంలోని జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాల సమీపంలో రైల్వే ట్రాక్‌పై మంగళవారం అర్ధరాత్రి చోటుచేసుకుంది. నంద్యాల రైల్వే పోలీసుల కథనం ప్రకారం.. పట్టణంలోని ఏబీఎం పాలేనికి చెందిన పందీటి రమేష్(39) 7 నెలల క్రితం బైక్ ప్రమాదంలో తలకు తీవ్రగాయాలయ్యాయి. ఈ నేపథ్యంలో అప్పుడప్పుడూ మతిస్థిమితం కోల్పోయినట్లు ప్రవర్తిస్తుంటాడు. బయటకు వెళ్లి వస్తానని చెప్పిన రమేష్ రైలు కింద పడి ఆత్మహత్య చేసుకున్నాడు. రమేష్ గిద్దలూరు నగర పంచాయతీలో పారిశుద్ధ్య కార్మికుడిగా పనిచేస్తున్నాడు. మృతుడికి భార్య, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గిద్దలూరు ఏరియా వైద్యశాలకు తరలించారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు రైల్వే పోలీసులు తెలిపారు.

విషాదం మిగిల్చిన విహార యాత్ర

- కొత్తపట్నం వద్ద ఆటోను ఢీకొన్న ట్రాక్టర్
- ఒకరు మృతి, ఆరుగురికి తీవ్ర గాయాలు
- సముద్ర స్నానానికి వచ్చి వెళ్తుండగా ప్రమాదం


ఘటనా స్థలం వద్ద ఆటోలో, పక్కన పడి ఉన్న క్షతగాత్రులు

కొత్తపట్నం: కొత్తపట్నం సముద్ర తీరంలో విహారానికి వచ్చిన పర్యాటకులు ఊహించని రీతిలో ప్రమాదం బారినపడ్డారు. సముద్ర స్నానం ముగించుకుని ఆటోలో తిరిగి ఇంటికి వెళ్లే సమయంలో ట్రాక్టర్ ఢీకొనడంతో ఒకరు మృతి చెందగా ఆరుగురికి తీవ్ర గాయాలయ్యాయి. ఈ ఘటన బుధవారం కొత్తపట్నం మెరైన్ పోలీస్ స్టేషన్ ఎదుట చోటుచేసుకుంది. పోలీసుల కథనం మేరకు.. చీమకుర్తి పట్టణంలోని గరికమిట్టపాలేనికి చెందిన ఏడుగురు సముద్ర స్నానం చేసేందుకు బుధవారం మధ్యాహ్నం ఆటోలో కొత్తపట్నం బీచ్‌కు చేరుకున్నారు. తీరంలో ఆనందంగా గడిపారు. తిరుగు ప్రయాణమైన కాసేపటికే కొత్తపట్నం మెరైన్ పోలీస్ స్టేషన్ ఎదుట శనగ కాయల లోడ్‌తో ఎదురుగా వస్తున్న ట్రాక్టర్ ఢీకొట్టింది. ఆటోలో ప్రయాణిస్తున్న ఏడుగురికి తీవ్రగాయాలయ్యాయి. క్షతగాత్రులను హుటాహుటిన ఒంగోలు జీజీహెచ్‌కు తరలించేందుకు 108 పైలెట్ దాసు దినేష్, టీఎంటీ నాగరాజు శ్రమించారు. వీరిలో నాగూరి ఈశ్వరమ్మ(65) అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు ధ్రువీకరించారు. మిగిలిన ఆరుగురు చికిత్స పొందుతున్నారు. సంఘటనా స్థలాన్ని ఎస్సై బి.సాంబశివరావు పరిశీలించారు. ప్రమాద సమాచారాన్ని క్షతగాత్రుల బంధువులకు తెలియజేశారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

ప్రకృతి పంటలకు అధిక డిమాండ్

- ప్రకృతి వ్యవసాయం జిల్లా ప్రాజెక్ట్ మేనేజర్ సుభాషిణి వెల్లడి


మాట్లాడుతున్న రైతు సాధికార సంస్థ ప్రతినిధి విజయ్

కొత్తపట్నం: ప్రకృతి వ్యవసాయ పద్ధతిలో పండించే వేరుశనగను అహ్మదాబాద్ ఫ్రూట్ టెక్నాలజీ సంస్థ వారు అధిక ధర పెట్టి కొనుగోలు చేయటానికి వచ్చారని ప్రకృతి వ్యవసాయం జిల్లా ప్రాజెక్ట్ మేనేజర్ వి.సుభాషిణి తెలిపారు. కొత్తపట్నం రైతు భరోసా కేంద్రంలో రైతు సాధికార సంస్థ ఆంధ్రప్రదేశ్ కమ్యూనిటీ, నేచురల్ ఫార్మింగ్ ఆధ్వర్యంలో బుధవారం రైతులతో అవగాహన సదస్సు ఏర్పాటు చేశారు. ఆమె మాట్లాడుతూ సంస్థ వారు 100 ఎకరాల్లో ప్రకృతి వ్యవసాయం సాగుబడి చేస్తున్న వేరుశనగ కాయలను కొనుగోలు చేయటానికి వచ్చారని తెలిపారు. సంస్థ ప్రతినిధులు అనంతకుమార్ శర్మ, షిఫాలికా జోషి మాట్లాడుతూ నూరుశాతం ప్రకృతి వ్యవసాయంతో పండించే పంటలను అధిక ధర పెట్టి కొనుగోలు చేస్తామని తెలిపారు. ఇలా పండించిన పంటలకు అంతర్జాతీయ మార్కెట్‌లో మంచి డిమాండ్ ఉండటమే కాకుండా రైతులకు గిట్టుబాటు ధర వస్తుందన్నారు. గిరినార్-4 అనే వేరుశనగ విత్తన రకం తెలుసుకోవడం కోసం పైలెట్ ప్రాజెక్ట్ కింద కొంత విస్తీర్ణంలో సాగు చేయాలని ప్రణాళిక సిద్ధం చేస్తున్నామన్నారు. రైతు సాధికార సంస్థ ప్రతినిధులు విజయ్, మండల అగ్రికల్చర్ ఆఫీసర్ మోహన్‌రెడ్డి, రైతులు, సిబ్బంది వికాస్‌రెడ్డి, మహేష్‌రెడ్డి, నరసింహులు పాల్గొన్నారు.